# ఆలోచించు

ఆంధ్రజ్యోతి 9-11-84

ఎవరో ఆలోచించి పెట్టింది మనం అనుసరించడం—అది ఈ విజ్ఞాన యుగంలో మన కవమానం.

—జయప్రద

---

"ఏవండీ"

సన్నగా విన్పించిన భార్య కంఠస్వరానికి పేపర్‌లోనుంచి తలె త్తాడు సత్యమూర్తి. ఆమె మాట్లాడలేదు.

"ఏవిటి చిన్నా?"

ఆమె తటపటాయిస్తూ చూసింది.

"చెప్పరా?"

"మీరు....మీరు కూడా అయ్యప్పస్వామి దగ్గరకు వెళ్ళకూడద దండీ...."

విపరీతంగా విస్తుపోయాడు సత్యమూర్తి.

నాలుగేళ్ళుగా కాపురం చేస్తున్న తన భార్య మనస్తత్వం అతనికి బాగా తెలుసు. ఎంతో కోరికుంటే, అది తన నిగ్రహశక్తిని మించిపోతే ఎప్పుడో, కానీ ఏదీ కోరదు తనను.

క్షణంలో తేరుకుని టాపిక్‌ని తమాషా క్రిందకు మార్చేస్తూ పక పక నవ్వాడు సత్యమూర్తి.

బెదిరిపోయినట్టుగా చూసింది శివకామేశ్వరి. ఆమె సర్వీస్ నిష్టం బలహీనత నర్థం చేసుకుని అతనెంత మార్దవంగా ప్రవర్తిస్తున్నా ఆమెకు అతని దగ్గర ఇంకా భయమే.

నవ్వాపేసాడు సత్యమూర్తి.

"అతనెవరు శివా?" కుర్చీలో సర్దుకూర్చుంటూ అడిగాడు.

"అతను కాదండీ అయ్యప్పస్వామి"

"ఓ క్రొత్తదేముడా? ఎప్పుడు వెలిసాడు?"

"కొత్తగా వెలియడం కాదండీ! కేరళలో ఎప్పటినుంచోవున్నాడు. మనకు తెలీదుకానీ" కాస్త హుషారుగా, కాస్త దిగులుగా అంది శివ కామేశ్వరి.

"ఓ మళయాళ దేవుడన్నమాట-మన దేవుళ్ళు ఇంతమంది వున్నారుగా శివా. మర్లా ఆ దేవుడెందుకూ?" పేపర్లోకి మరలా తల దూర్చబోతూ అన్నాడు.

"అట్లాంటారేవిటండీ? దేవుడు ఎవరిదేవుడయితే ఏవిటండీ?"

"నిజమేరా కానీ-మనం ఇప్పుడు అయ్యప్పస్వామి కొండకు పోయామనుకో-అప్పుడు మన ఏడుకొండల స్వామికి కోపంరాదూ?"

వెనక్కు తగ్గిందో శివ. ఆలోచనల్లో పడిపోయింది. "వెంకటేశ్వర స్వామికి కోపం వస్తుందా?"

అదే భర్త నడిగింది.

"ఒక్క వెంకటేశ్వరస్వామి అనేముంది. మన దేముళ్ళు శివుడు, కృష్ణుడు, కామాక్షమ్మ, రాజరాజేశ్వరీదేవి, సుబ్రమణ్యస్వామి, పెంచల స్వామి, రంగనాయకులస్వామి, లక్ష్మీదేవి మొదలగు ముక్కోటి దేవుళ్ళు పాపం మనసు కష్టపెట్టుకుంటార్రా!"

దిగులుపడి పోయింది శివకామేశ్వరి.

ఆమె గుండెల్లో దిగులు చప్పున ముఖంలో రిఫ్లెక్ట్ అవుతుంది.

భార్య దిగులుగా వుంటే చూడలేడు సత్యమూర్తి. అది అతని బలహీనత.

"అట్లాగేలే శివా. ఇద్దరం ఒక రోజెళదాం"

అతడు పరమ నాస్తికుడు. కానీ భార్య కొరకు ఆమె మనసు బాధపెట్టడం ఇష్టంలేక అప్పుడప్పుడూ ఆమెతో గుళ్ళో కెళుతుంటాడు

"అయ్యో! ఆడవాళ్ళు కొండకు రాకూడదండీ" భర్త అమాయకత్వానికి జాలిపడుతూ అంది కామేశ్వరి.

"అదేం? భక్తి ఆడవాళ్ళ జన్మహక్కయితే ఆడవాళ్ళు వెళ్ళకూడక పోవడ మేమిటి?"

"మరలా పెద్దమనిషి కాని పిల్లలు. ముసలాళ్ళు వెళ్ళొచ్చు" గొంతు తగ్గించి కాస్త ముందుకు వంగి అంటున్న భార్య వైపు ఆశ్చర్యంగా చూసాడు సత్యమూర్తి.

నిజానికి ఆ సత్యం ఇంతవరకు అతనికి తెలీదు. కొల్లలు కొల్లలుగా జనం-విద్యాధికులు కూడా హఠాత్తుగా అయ్యప్పస్వామిభక్తిలో పడిపోయిన సంగతి తెలుసు. కానీ అయితే అందులో ఇలాటి రూల్స్ రెగ్యులేషన్స్ వున్నట్టు తెలీదు.

సవతితల్లి కొడుకుని పులిపాలు కావాలని కోరడం, పులిమీద ఎక్కి వచ్చిన అతన్ని అందరూ దేముడిగా భావించడం-ఆ కధ అతనికి తెలుసు. ఈ మధ్యనే శరణం అయ్యప్ప సినిమా చూసాడు.

"అదే కాదండీ ఇంకా ఎన్ని నిబంధనలనీ. క్రిందే పడుకోవాలీ, బ్రహ్మచర్యం అవలంభించాలీ. కొండ కాలి నడక నెక్కాలీ. ఇంకా...."

"ఆగు ఇంకా చాలా వున్నాయిలే. అలాటి కొత్తపద్ధతులు పెట్టక పోతే పాపులారిటీ వచ్చేదెలా? ఇదీ బిజినెస్! ఎవరిదో మంచి బుర్రే!"

"ఓకే. ఓకే. వాళ్ళ గురించి మన కెందుకుగానీ శివా! మరీ-నువ్వు లేకుండా నా కొక్కడికే వెళ్ళాలనిపించదే. పైగా మనిద్దరం కలిసి బ్రతకక్కర్లేదదంటివి ఇదెక్కడి అన్యాయం."

"పోండి మీరు మరీను. ఆ మాత్రం వుండమేంటి!" అని తన భర్త అభ్యంతరాన్ని కొట్టి పారేసింది. కానీ ఆమెకూ దిగులేసింది. ఆతనిని చూడకుండా తను క్షణం వుండగలదా?

"ఓ నన్నొదిలి నీవుండగలవన్నమాట. వెరీగుడ్!....అవునూ శివా! అసలు కొండ కెళ్ళడం ఎందుకూ?"

"అక్కడ జ్యోతి వుంటుందండి-అది చూడనూ"

"జ్యోతిని-చూడ్డం ఎందుకూ?"

"పాపాలు పోతాయండీ!"

"అయితే నేవెళ్ళ నక్కర్లేదు. నేను పాపాలు చేయలేదు"

పసిపిల్లాడిలా కాళ్ళు రెండూ ఎత్తి ప్రేము కుర్చీలో ముడుచుకుని కూర్చుని పేపర్‌లోకి తల దూర్చేసిన భర్త వంక నిరాశగా చూసిందామె.

"టిఫిన్ తీసుకురానా?"

"ఆ....అలాటివి చెప్పు చేసేద్దాం. రెండు ప్లేట్లు పట్రా యిద్దరం తిందాం"

ఆ రోజుకి ఆ టాపిక్ మరలా ఎత్తలేదు కామేశ్వరి.

* * * *

"అదో....మీవారు పలకరించవేం?"

ఎదురుపడి వెళ్ళిపోయిన పంకజం భర్తను వెనక్కి తిరిగి చూస్తూ కూరగాయలసంచి ఎడమ చేతిలోకి మార్చుకుంటూ ఆశ్చర్యంగా అడిగింది కామేశ్వరి.

చిరునవ్వు నవ్వింది పంకజం.

"మేము మాట్లాడుకోవడంలేదు."

"అదేం?" కామేశ్వరికి బొత్తిగా అర్థం కాలేదు. పంకజం భర్త కొంతకాలం దక్షిణకెళుతున్నాడు. పంకజాన్ని నిన్ననే పుట్టింటికి పంపాడు. పంకజం పుట్టిల్లు కామేశ్వరి ఇంటి ప్రక్కనే. వచ్చినప్పటినుండి చూస్తోంది. గంటకు పదిసార్లన్నా భర్త గురించి చెపుతుంది. భర్త దూరాన్ని తలచుకొని దిగులు పడిపోతుంది. అట్లాంటిది బజారులో ప్రాణనాథుడు ఎదురుపడితే మాట్లాడదేం! పైగా మాటలు లేవంటుంది?

స్నేహితురాలి ప్రశ్నార్థకపు మొహం చూసి ఫక్కున నవ్వేసింది పంకజం.

"నేను బయటున్నాన్లే"

"బయటుంటే మాట్లాడుకోకూడదా?"

"ఊహుఁ"

ఎందుకు మాట్లాడుకో కూడదో కామేశ్వరి అడగలేదు. పంకజం చెప్పలేదు. మాట్లాడుకో కూడదనే సత్యాన్ని నిశ్శబ్దంగా అన్నిటిలాగే జీర్ణంచేసుకుంది కామేశ్వరి.

* * * *

"రేపు కమలక్క వాళ్ళింట్లో అయ్యప్పస్వామి భజన వుందంట. వెళ్ళొస్తానండి"

క్షణం మాట్లాడలేదు సత్యమూర్తి. భార్య కళ్ళల్లోకి, ఆ కళ్ళల్లో వున్న కోరికకేసి చూసాడు.

"సరే వెళ్ళు త్వరగా వచ్చెయ్. నీ కోరకు ఎదురు చూస్తుంటాను."

ఆమె కళ్ళల్లో కోటి కాంతులు....

ఎప్పుడూ సత్యమూర్తి ఆమెను కాదనడు. అయినా ఎప్పటి కప్పుడే తన కోరిక అతని కిష్టం వుండదేమో, అతని మనసు బాధ పడు తుందేమో అని భయపడుతూనే అడుగుతుంది కామేశ్వరి.

"అన్నట్టు మర్చిపోయాను సోమయ్య మీ కొరకు మీరు ఆఫీసు నుండి రాకముందు నుండి ఎదురుచూస్తున్నాడు."

"రమ్మను"

★ ★ ★ ★

వాకిట లోపల నిల్చుని తన భర్త సోమయ్య రిక్వెస్టును కాదంటు న్నది విని కామేశ్వరి మనసు బాధ పడింది.

"తోచినంత ఇమ్మంటున్నాడుగా ఓ పదిరూపాయిలిస్తే పోలా? ప్రొద్దున లేస్తే వాళ్ళకీ వీళ్ళకీ రూపాయో, రెండో ఇస్తూనే వుంటాడు గదా!"

సోమయ్య వెళ్ళిపోయాక భర్తతో సంకోచిస్తూనే అంది ఆమె.

"పోనీ పది రూపాయలివ్వక పోయారండీ అయ్యప్ప కొండ కెళ్ళా నంటున్నాడు"

తదేకంగా రెండు నిమిషాలు భార్యవంక చూసిన సత్యమూర్తి ఏదో నిర్ణయించుకున్న వాడిలా కంఠం విప్పాడు.

"చూడు శివా! డొనేషన్ అడిగి అయ్యప్పకొండకు పోవాల్సిన పనేలేదు. అది అంత అవసరం కాదు ఏమంటావ్?"

"దేముడి దగ్గరకు పోతానంటే...." ఆగిపోయిందామె.

"ఫరవాలేదు చెప్పు నీ మనసులో వుండేది చెప్పు. ఈ రోజు మనిద్దరం దేముడి గురించి కాస్త ఫ్రీగా మాట్లాడుకుందాం."

"దేముడి గురించి ఏం మాట్లాడుకుంటాం?" బిత్తరపోయినట్టు చూసింది.

"ఏదో ఒకటి మన మనసుకు తోచింది. మొదట కూర్చో ఆ స్టూల్ లాక్కొని. ఇంతకీ సోమయ్యకు పదిరూపాయలయినా ఇవ్వనం దుకు నీకు బాధేసింది అవునా?"

అవునన్నట్లు చూసి కళ్ళు వాల్చుకుంది శివ.

"మొన్న పోలమ్మ వాళ్ళమ్మను రాయవేలూరుకు తీసుకెళ్ళి చూపించుకుంటానంటే వందరూపాయలిచ్చారా మీరు?"

ఆమె సన్నటి స్వరాన అంటున్నా తను అలా ఓ పనిపిల్లకు వంద రూపాయలు సునాయాసంగా ఇచ్చేయడం ఆమెకు నచ్చలేదనే భావం ఆ స్వరంలో కనిపెట్టిన సత్యమూర్తి సన్నగా నవ్వుకున్నాడు.

"శివా! నేనిచ్చిన నూరు రూపాయలతో పోలమ్మ తల్లి బాగయినదో లేదో నాకు తెలియదు. కానీ తల్లిని బ్రతికించుకోవాలన్న తపన పోలమ్మలో కన్పించింది నాకు. తల్లిపోతే మరో తల్లిరాదు శివా! ఈ దేముడు కాకపోతే మరో దేముడు వెలుస్తాడు."

బెదిరిపోయినట్టుగా చూసింది కామేశ్వరి.

"ఛీ ...ఛీ.... అలా అనకండి కళ్ళు పోతాయి."

ఈసారి ఎప్పటిలా భార్య చెదిరిన కళ్ళనుచూసి టాపిక్ అక్కడితో ఆపు చేయలేదు సత్యమూర్తి. తన భార్య అజ్ఞానాన్ని ఇంకా కొనసాగించ దల్చుకోలేదు.

"కళ్ళు పోతాయా? ఎందుకు?"

"దేవుడిని అంటే పోవూ?"

"దేవుడంటే ఎవరు శివా?"

ఎప్పుడూ వినని క్రొత్త ప్రశ్న విన్న విద్యార్థిలా మొహంపెట్టిన భార్యను చూస్తే జాలి వేసిందతనికి.

"పోనీ ఇది చెప్పు. నీ కొడుకు రేపొద్దున నిన్నుకాదని వాడి భార్యతో వెళ్ళిపోయాడనుకో; నీ మనసు కష్టపెట్టాడనుకో అప్పుడు.... అప్పుడు నువ్వు నీ కొడుకు కళ్ళుపోవాలని శపిస్తావా?"

"అదేం మాటా?"

"అంటే అలా శపించలేవు అవునా? మరి దేముడి ఉనికే నిజమైతే వాడిలో తల్లిలో వుండే ప్రేమ, క్షమ, కరుణ వుండాలి. అంతేగానీ తన బిడ్డ తనను కాదంటే, తన కోరికలు తీర్చకపోతే, తనకు లంచం ఇవ్వకపోతే కళ్ళుపోగొట్టే కిరాతకుడు కాకూడదు."

అతని కంఠంలో ఆవేశానికి ఆశ్చర్యపోతోంది కామేశ్వరి.

స్పృహలోకొచ్చాడు సత్యమూర్తి.

"ఆలోచించు శివా! మనల్ని పరిపాలించే వ్యక్తే దేముడయితే, అతనికొక ఆకారం వుంటే, స్పందించే మనసుంటే అతను ఎంత ఉదాత్తుడై వుండాలి? ఇన్నికోట్లమంది జనం ఆరాధించే మూర్తి ఎంతఉన్నతుడయి వుండాలి."

కామేశ్వరి మూగదానిలా చూస్తోంది.

"భగవంతుడు నా దృష్టిలో లేడు. కాదూ ఉన్నాడనికూడా అనుకుందాం ఎందుకున్నాడు? అతని పనేంటి? మనల్ని కాపాడ్డం. మనల్ని కాపాడినదానికి మన దగ్గర నుండి లంచం కోరుతున్నాడా? కోరితే మన కంటే గొప్పవాడెలా అవుతాడు? అలాంటప్పుడు మనం ఎందుకు అతన్ని పూజించాలి?"

అతను ఆగాడు.

కామేశ్వరికి ఒక్కముక్కకూడా అర్థం కావడంలేదు.

"అసలు శివా! ఇన్ని దేవుళ్ళెందుకు? ఆ దేవుళ్ళకు అన్ని కథలెందుకు? ఆలా వాళ్ళమీద కథలల్లి వాళ్ళను బఫూన్లని చేస్తున్నాం మనం."

అయాసపడ్తున్నాడతను.

"ఈయనకు గాని మతిపోలేదు కదా! ఎందుకిలా మాట్లాడుతున్నారు?" అని ఆశ్చర్యపోతోంది, దిగులు పడుతోంది. దేముళ్ళమైనా ఆగ్రహిస్తారని భయ పడుతోంది.

"వద్దులేండి మనం దేముడి గురించి మాట్లాడుకోవద్దు. స్నానం చేయండి లేవండి."

"అలాగే వెళతాను. ఒక్కక్షణం కూర్చో శివా! ఒక్కటడుగుతాను చెప్పు. రేప్రొద్దున మన త్రిశూల్ పెద్దవాడయి ప్రక్కింటివాళ్ళ రేడియో సెట్ అమ్మి నీకు సగం డబ్బుతో చీర తెచ్చాడనుకో నువ్వు సంతోషపడ్తావా?"

"ఛీ ఛీ" ఒక్క క్షణంకూడా ఆలస్యం చేయకుండా అనేసింది.

"సరే. దేముడనే వాడే వుంటే నీ కంటే గొప్పవాడయ్యుంటాడా? తక్కువ వాడయ్యుంటాడా?"

"అదేం మాటండీ భగవంతుడితో నాకు పోలికేవిటి?"

"ఆలోచించు శివా! దేవుడికి మనం బిడ్డలం. నీకు త్రిశూల్ బిడ్డ అవునా?"

అవునన్నట్టు తలాడించి అయోమయంగా చూసింది కామేశ్వరి.

"ఓకే బాగా విను శివా! వింటున్నావా?" ఆమె గడ్డం పట్టుకుని తనవైపుకు తిప్పుకున్నాడతను.

"చెప్పండి."

"వెంకటేశ్వరస్వామి హుండీ దేనితో నిండుతోంది? దొం.... డబ్బుతో...."

"ఛ ఛ అవేం మాటలండీ."

"అవి వున్నమాటలే. నీకంటే నాకు ఈ విషయంలో ఎక్కువ తెలుసు."

"సరే చెప్పండి"

"దొంగడబ్బు, నల్లడబ్బు"

ఆమె కళ్ళింతవి చేసుకుని చూస్తోంది.

"అంటే ఆ డబ్బు సంపాదించడానికి వెంకటేశ్వరస్వామికి లంచం ఆఫర్ చేస్తున్నావన్నమాట. వాళ్ళ తెలివితేటలు సక్సెస్ అయి లాభిస్తే, మంచి కత్తిరింపులు దొరికితే దేముడే సహాయంచేస్తాడని నమ్మి తన మాట నిలుపుకోకపోతే దేముడు తమ్ము శిక్షిస్తాడని-చెప్పినప్రకారం దేముడి కోటా దేముడి కిస్తున్నారు"

చెప్పడం ఆపి భార్యవేపు చూసాడతను.

ఆమె ఏదో ఆలోచిస్తున్నట్టుగా చూస్తోంది. అతనిలో కొంత ఆశ.

"శివా! బాగా ఆలోచించు. దేవుడే వుంటే అతను తన బిడ్డలు పతనమైపోతుంటే పూరుకుంటాడా? ఏదోవిధంగా సాయం చేయడానికి ప్రయత్నించడా?

ఓ బిడ్డ మరో బిడ్డను దోచుకుని తనకు బంగారు తొడుగు తొడిగితే సంతోషిస్తావా?

అంతెందుకు రేపు మన త్రిశూల్ చంటిదాన్ని అన్యాయంచేసి నీకు వజ్రాలదండ చేయిస్తే నువ్వు సంతోషిస్తూ వాడికి ఆశీర్వదిస్తావా?"

ఆమె ముఖంలో కొంత సీరియస్‌నెస్, కొంత తేజస్సు కొంత వివేకం.

మరలా ఏదో శంక, భయం.

"ఏదోలెండి అవన్నీ మనకెందుకు? మన పెద్దాళ్ళంతా పూజించలా? వాళ్ళ తోవలోనే నడిస్తేపోయే"

"అదే....అదే....వద్దంటాను. మన పెద్దవాళ్ళు చేసారని మనమెందుకు చేయాలి? మన ఆలోచనాశక్తి ఏమయింది? దేముడిని ఎందుకు పూజించాలి? ఆలోచించు"

*